## క్లుప్తంగా

### విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ



విద్యార్థులకు కాలేజీ బ్యాగ్‌లు అందజేస్తున్న తోట ఎడ్వర్డ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సేవా కార్యక్రమాలతో మానసిక సంతృప్తి కలుగుతుందని యాంటినోరీ సోషల్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి తోట ఎడ్వర్డ్ అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ అంతోని హైస్కూల్ ప్రాంగణంలో యాంటినోరీ సోషల్ సర్వీస్ సొసైటీ తరుపున 100 మంది కాలేజీ విద్యార్థులకు కాలేజీ బ్యాగ్‌లు, హాట్ క్యారేజీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎడ్వర్డ్ మాట్లాడుతూ తమ సొసైటీ ద్వారా గత 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు.

### ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు

భీమడోలు: ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఆదివారం గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పోలసానిపల్లిలో గ్రామ కార్యదర్శి షేక్ రహీమాబేగం సూచనల మేరకు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసుల వాడకాన్ని నిషేధించాలని కోరుతూ గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణ, సిబ్బంది భీమడోలు జంక్షన్, పోలసానిపల్లి ఏరియాల్లోని కూరగాయల దుకాణాలు, చికెన్, మటన్ దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వినియోగాన్ని నివారించాలని, జూట్, గుడ్డ సంచులు వినియోగించాలని దుకాణదారులకు తెలియజేసారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భారీగా జరిమానాలు విధిస్తామని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గోవింద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆరోగ్య సర్వేకు ప్రజలు సహకరించాలి

దెందులూరు: గ్రామాల్లో ఇంటింటా ఆరోగ్య సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. నివేదికను వైద్య అధికారికి అందజేస్తామని వారన్నారు. సర్వే చేసిన ఇంటిగుమ్మం వద్ద క్రమ సంఖ్య నమోదు చేస్తున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. వైద్య సిబ్బందికి, గృహాల్లో వ్యక్తులు పూర్తిగా సహకరించి అనారోగ్య సమాచారాన్ని తెలియజేయాలన్నారు. అప్పుడే వ్యాధి నిర్ధారణ, నిర్మూలనకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆయన వెంట ఎంపీహెచ్‌ఓ హరి, వైద్య సిబ్బంది ఉన్నారు.

# నిమ్మకు తెగుళ్లు.. రైతు కుదేలు

- ఆశాజనకంగా నిమ్మ ధర
- తెగుళ్లతో పడిపోయిన నిమ్మ దిగుబడి
- నష్టాలు తప్పవంటున్న రైతులు



రైతు తెచ్చిన కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



ఏలూరు మార్కెట్‌యార్డ్‌లో నిమ్మకాయలు కొనుగోళ్లు చేస్తున్న వ్యాపారులు

ఏలూరు రూరల్: ఈ ఏడాది నిమ్మకాయల దిగుబడి సగానికి సగం పడిపోవడంతో రైతులు కుదేలవుతున్నారు. తెగుళ్ల కారణంగా నిమ్మతోటల్లో దిగబడి కనిపించడం లేదు. దీంతో ఈ ఏడాది నష్టాలు తప్పవని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ధర ఆశాజనకంగా ఉన్నా దిగుబడి లేకపోవడంతో తాము నష్టాల ఊబిలో కూరుకుపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఊహించని రీతిలో పెరిగిన ధర**

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఫిబ్రవరి రెండోవారంలోనే నిమ్మకాయలు రేటు అమాంతం పెరిగింది. ఏలూరు మార్కెట్‌యార్డ్‌లో కేజీ నిమ్మకాయలు రూ.60 నుంచి రూ.70ల వరకూ పలుకుతోంది. గత ఏడాది ఇదే నెలలో కేజీ నిమ్మకాయల ధర రూ 28 నుంచి రూ.33 పలికింది. సాధారణంగా ప్రతి ఏటా ఏప్రిల్ నెల రెండు లేదా మూడోవారంలో ఈ రేటు ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరి మొదట వారం నుంచి వ్యాపారులు నిమ్మకాయలను పెద్ద ఎత్తున కొంటున్నారు.

**తెగుళ్ల దెబ్బ**

మరోపక్క తోటల్లో నిమ్మ దిగుబడి తగ్గింది. కొద్దినెలలుగా నిమ్మతోటలకు పట్టిన తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని మందులు కొట్టిన తెగుళ్ల నివారణ కాలేదంటున్నారు. దీనికి నాసిరకం పెస్టిసైడ్స్ కారణమని, ఈ ఏడాది కూడా నష్టాలే మిగులుతాయని వాపోతున్నారు.

**అన్నింటా నష్టమే**



ఈ ఏడాది తెగుళ్ల సోకి దిగుబడి తగ్గిపోయింది. ఎన్ని రకాలు మందులు కొట్టిన తెగుళ్లు వదల్లేదు. అరకొరగా వచ్చిన కాయలు తెచ్చి అమ్ముకుంటున్నాం. రానున్న రోజుల్లో నిమ్మ సాగు కూడా కష్టమే. అందుకే రైతులు లీజుకు ఇచ్చేస్తున్నారు. కాయలు కోయాలంటే కూలీలు కూడా దొరకడం లేదు.

– చల్లా సత్యనారాయణ, ధర్మాజీగూడెం.రైతు

**మంచి దిగుబడితో రాబడి**



ఈ ఏడాది పెద్ద ఎత్తున వ్యాపారం సాగుతుందని భావిస్తున్నాం. మంచి దిగుబడి వచ్చిన రైతులకు లాభాలు వస్తాయి. మే నెలలో రోజుకు 600 నుంచి 800 టన్నుల ఎగుమతి జరుగుతుందని అంచనా. 2019 కరోనా సమయంలో సైతం ఎన్నడూ లేని విధంగా 1300 టన్నుల నిమ్మ కాయలు ఎగుమతి చేసి రైతులు రికార్డు సృష్టించారు.

– కె శారధారాణి, ఏఎంసీ సెక్రటరీ

### మహిళల రక్షణకు ప్రాధాన్యత

ఏఎస్పీ సూర్యచంద్రరావు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులతో ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక శ్రద్ధతో జిల్లాలో మహిళల రక్షణ, భద్రతకు పెద్దపీట వేసినట్లు ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏలూరు అమీనాపేటలోని పోలీస్ కళ్యాణ మండపంలో విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటూ మహిళా సాధికారిత, లైంగిక సమానత్వం, మహిళా భద్రత తదితర అంశాలపై సాంస్కృతి, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ మహిళలపై నేరాలను అదుపు చేసేందుకు సత్వర న్యాయం చేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మహిళా స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

# ముగిసిన రామకోటి ఉత్సవాలు



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో గత నెల 8వ తేదీ నుంచి జరుగుతున్న 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు ఆదివారం నాటితో ముగిశాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామనామ పారాయణం చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 2 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం 6.30 గంటలకు నగరానికి చెందిన ది వెంకట్రాయ నాట్య శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచారిణి నీలి శర్వాణి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అర్చక స్వాములు దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

# లయన్స్ క్లబ్‌ల సేవలు ఆదర్శనీయం



అవార్డులందుకున్న క్లబ్‌ల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పేదల అభ్యున్నతికై లయన్ అంతర్జాతీయ సంస్థ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని లయన్ రీజియన్ చైర్‌పర్సన్ ఎం.కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం ఏలూరు న్యూ అశోక్ నగర్‌లోని కాకరాల కృష్ణమూర్తి అన్నపూర్ణమ్మ లయన్ మల్టీ సర్వీస్ సెంటర్లో లయన్స్ జిల్లా 316 జి రీజియన్ 1 సేవా మాధుర్యం రీజియన్ సమావేశాన్ని జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు ప్రారంభించారు. సేవా మహోత్సవంలో పేదలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు, విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈ సమావేశంలో విభిన్న అంశాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులు అందజేశారు. ఉత్తమ ప్రెసిడెంట్‌గా పీవీ రమణ, ఉత్తమ కార్యదర్శిగా ఎన్‌డీ కృష్ణ, ఉత్తమ కోశాధికారిగా కే. కిషోర్ కుమార్, ఉత్తమ క్లబ్‌గా హేలాపురి లయన్ క్లబ్ అవార్డులు అందుకున్నారు. లేళ్ళ వెంకటేశ్వరరావును 'లయన్ ఆఫ్ ది రీజన్' అవార్డుతో, మోస్ట్ ఇన్వాల్వ్‌డ్ లయన్ అవార్డుతో ఎం.శ్రీహరిని అభినందించారు. రీజియన్‌లోని ఏలూరు హేలాపురి లయన్ క్లబ్ ఉత్తమ క్లబ్‌గా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ మల్టిపుల్ జిల్లా 316, 320 లయన్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏరియా లీడర్ డాక్టర్ అంబటి సుధాకర్ రెడ్డి పాల్గొనగా పీ సుభాష్ బాబు, జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ పాపారావు నాయుడు, ద్వితీయ వైస్ గవర్నర్ డాక్టర్ డీ. సుబ్బారావు, జిల్లా పూర్వ గవర్నర్‌లు, ఆహ్వాన సంఘం చైర్ పర్సన్ కేవీ కిషోర్ కుమార్, చీఫ్ అడ్వైజర్ డాక్టర్ వీకే పంకజాక్షన్, పూర్వపు జిల్లా గవర్నర్ వేమా కోటేశ్వరరావు, అడ్వైజర్ కాకరాల రాజేంద్ర వరప్రసాద్, రీజియన్ సెక్రటరీ ఎం.ఉమా కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# వాసు మాస్టర్ సేవలు అభినందనీయం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంగీత రంగంలో ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ ఎస్‌పీఎస్ వాసు మాస్టర్ అందించిన సేవలు అభినందనీయమని పలువురు అతిథులు కొనియాడారు. ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ 23వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ వాసు మాస్టర్ అనేక చలన చిత్రాలకు దర్శకత్వం వహించడంతో పాటు తన మ్యూజిక్ స్టూడియో ద్వారా ఎన్నో చలనచిత్రాలకు రీ రికార్డింగ్ అందించారన్నారు. అలాగే చిన్నారులకు వాద్య సంగీతంలో శిక్షణ ఇస్తూ వందలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. అనంతరం వాసు మాస్టర్ సంగీత దర్శకత్వంలో శిష్యులు నిర్వహించిన సంగీత కచేరి అతిథులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, వై.అర్జునరావు, మానవత విద్యా కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, వహీదా వాసు తదితరులు పాల్గొన్నారు.

### రంజాన్ ప్రార్థనలు ప్రారంభం



కొయ్యలగూడెంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కొయ్యలగూడెం: ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. కొయ్యలగూడెం జామియా మస్జిద్‌లో ఐదు పూటలా నమాజు ఆచరించి ముస్లింలు దానధర్మాల కార్యక్రమాలు చేపట్టారు. కన్నాపురం, దిప్పకాయలపాడు, వేదాంతపురం, యర్రంపేట, బయ్యన గూడెం తదితర గ్రామాల్లో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు.

# రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి



ఐక్యతను చాటుతున్న ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా నాయకులు

ఏలూరు (టూటౌన్): సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 5వ తేదీన జిల్లా కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపునిచ్చింది. ఏలూరు అన్నే భవనంలో ఆదివారం నిర్వహించిన సమితి సమావేశానికి ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘ నేతలు మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులను మోసగించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పి రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు బదులు మరింత ప్రమాదకర కొత్త చట్టాలు తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల కోరుతున్న చట్టాలు కాకుండా కార్పొరేట్ కంపెనీలు కోరుతున్న చట్టాలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. కార్మిక వ్యతిరేక లేబరు కోడ్‌లను రద్దు చేయాలని, రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 16 | అరటి కాయ (1) | 06-08 |
| వంకాయలు (గులాబీ) | 24 | చిక్కుడు కాయలు | 48 |
| వంకాయలు (కాంతులు) | 30 | బీర్ల చిక్కుడు | 60 |
| వంకాయలు (తెలుపు) | 24 | చామదుంపలు | 44 |
| బెండకాయలు | 36 | ములక్కాడలు | 10, 15 |
| పచ్చిమిర్చి | 24 | కంద | 80 |
| కాకర కాయలు | 32 | బీట్‌రూట్ | 32 |
| బీరకాయలు (పందిరి) | 44 | కీరా దోస | 40 |
| కాలీఫ్లవర్ | -- | ఫ్రెంచ్‌బీన్స్ | 60 |
| క్యాబేజీ | 16 | అల్లం | 60 |
| క్యారెట్ | 34 | కొత్తిమీర (కట్ట) | 15 |
| దొండకాయలు | 38 | పాలకూర | 10 |
| బంగాళదుంపలు | 26 | చుక్కకూర | 10 |
| ఉల్లిపాయలు | 40 | తోటకూర | 10-12 |
| గోరుచిక్కుడు | 40 | గోంగూర | 07-10 |
| దోసకాయలు | 20-36 | పుదీనా | 05 |
| ఆనబకాయ (1) | 20 | క్యాప్సికమ్ | 56 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకదదుంప | 44 |

# సీపీఐ నేత జేవీ అరెస్ట్ అక్రమం

ఏలూరు (టూటౌన్): సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అరెస్ట్ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అరెస్టు తీరు సక్రమమైన పద్ధతిలో లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పూనుకోవడం సరైన చర్య కాదన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపడితే వచ్చే ఎన్నికల్లో కనుమరుగయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అక్రమంగా అరెస్టు చేసిన సత్యనారాయణమూర్తిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**ఏపీ మహిళా సమాఖ్య ఖండన..**

సీపీఐ నేత జేవీ సత్యనారాయణమూర్తి అరెస్టు అక్రమం అని ఏపీ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) ఏలూరు జిల్లా సమితి అధ్యక్ష కార్యదర్శులు వరకా శ్యామల, మన్నవ యామిని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో గోపాలపట్నం సమీపంలోని ఎల్‌జీ పాల్మర్స్ కంపెనీ విషవాయువులు వెదజల్లడంతో వందలాదిమంది ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురైనారని, పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈఘటనపై కంపెనీ యాజమాన్య వైఖరిని నిరసిస్తూ బాధితులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో జేవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సీపీఐ శ్రేణులు ఆందోళన చేపట్టారని తెలిపారు. కరోనా నిబంధనలు ఉల్లంఘించారంటూ అప్పట్లో ఆయనపై కేసు నమోదు చేశారన్నారు. అప్పటినుంచి నేటివరకు కేసు పెండింగ్‌లో ఉండగా, ఇప్పుడు పెండింగ్ కేసుల పరిష్కారం అంటూ పోలీసులు సత్యనారాయణమూర్తిపై దారుణంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు విచారకరం అన్నారు.

# వీడని బర్డ్‌ఫ్లూ భయం... పెరగని చికెన్ అమ్మకం



గణపవరంలోని చికెన్ దుకాణంలో అమ్మకానికి సిద్ధం చేసిన కోళ్లు

గణపవరం: బర్డ్‌ఫ్లూ భయం ఇంకా ప్రజల మది నుంచి పూర్తిగా తొలగిపోలేదు. ఇంకా చికెన్ అమ్మకాలు నామమాత్రంగానే సాగుతున్నాయి. రెండు వారాలుగా మూత పడిన చికెన్ వ్యాపారం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయితే ఇంకా పూర్తిగా గాడిన పడటానికి మరో రెండు వారాలు పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. చికెన్, కోడిగుడ్డు నిర్భయంగా తినవచ్చునని అధికార యంత్రాంగం ప్రకటిస్తున్నా ప్రజలు మరికొంత కాలం చికెన్‌కు దూరంగా ఉంటేనే మంచిదని భావిస్తున్నారు. దీనితో చికెన్ వ్యాపారం ఇంకా కోలుకోలేదు. ఈ రెండు వారాల్లో చికెన్ అమ్మకాలు కేవలం 20 శాతం మాత్రమే పెరిగాయి. మాంసాహార విక్రయాలు జోరుగా సాగే ఆదివారం కూడా గణపవరంలో చికెన్ దుకాణాలు ఖాళీగానే దర్శనమిచ్చాయి. ఆదివారం వందల సంఖ్యలో బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు జరిగేవని, ఈవారం పట్టుమని పది కోళ్లు కూడా విక్రయించలేదని వ్యాపారులు వాపోతున్నారు. ప్రస్తుతం గణపవరంలో కిలో చికెన్ స్కిన్‌లెస్ రూ.200, స్కిన్‌తో రూ.180 చొప్పున విక్రయిస్తున్నారు.

### పశువులకు గాలికుంటు వ్యాధి నిర్మూలన టీకాలు

దెందులూరు: గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నామని పోతునూరు పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సీహెచ్ శ్రీరాములు అన్నారు. ఆదివారం పోతునూరు పశువైద్యశాలలో ఆయన సిబ్బందితో కలిసి ఇంటింటా పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజులపాటు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పోతునూరులో 2,200 ఆవులు, గేదెలు ఉన్నాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 27 |
| ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర) | 20.15 | 35 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 17 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 35 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 25 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 23 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 21 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 22 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 4800 | 18 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 21 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 19 |
| ఏలూరు - తిరుపతి | 16.0 | 4830 | 30 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 20 |

### ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు 37 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకుని సందడి చేశారు. బాల్య స్నేహితులను కలుసుకోవడం మర్చిపోలేని అనుభూతిగా గుర్తుంచుకుంటామని పూర్వ విద్యార్థులు అన్నారు. 1989-90 పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. మృతిచెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. పాఠశాల, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు, పీఈటీ జీ ప్రసాద్‌ను విద్యార్థులు సత్కరించారు. త్వరలోనే పాఠశాలకు తమ వంతు ఆర్థిక సహాయం అందిస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు.

### సారా తయారీదారులకు బెల్లం విక్రయిస్తే చర్యలు



బెల్లం వ్యాపారులతో నిర్వహిస్తున్న సమావేశం

జంగారెడ్డిగూడెం: నాటుసారా తయారీదారులకు బెల్లాన్ని విక్రయించవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏలూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండు రంగారావు బెల్లం వ్యాపారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. వ్యాపారులు నాటు సారా తయారీదారులకు బెల్లం సరఫరా చేయకూడదని, అలా సరఫరా చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు, ఎస్సైలు ఎస్‌ఎన్‌ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు భక్తులు వేరువేరుగా ఆదివారం రూ.2,00,116 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా పీవీఎస్ కిరణ్ రూ.1,00,000, ఎం.రమాదేవి రూ.1,00,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్‌లు దుర్గాప్రసాద్, హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించారు. అలాగే స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.